
సాక్షి
బాపట్ల
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



పీహెచ్‌సీలో టీబీ అధికారి తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,79,998 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గమ్మ సేవలో మండలి చైర్మన్

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

మహాలక్ష్మీ దేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీదేవీ శరన్నవరాత్ర్యుత్సవాలలో భాగంగా అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శుక్రవారం బాల చాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశతి, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కోదండ రామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన చతుర్వేదుల శ్రీనివాసశాస్త్రి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖకు అందజేశారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకారం అందిస్తా

జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట: జిల్లాలో నిర్మిస్తున్న వరికెపూడిశెల, పోలవరం–బనకచర్ల ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు భరోసా ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అవసరమయ్యే అనుమతుల కోసం నిరీక్షించకుండా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి అలైన్‌మెంట్ ఫిక్సింగ్‌ను వారం రోజుల్లోగా పూర్తిచేసి ల్యాండ్ ప్లాన్ షెడ్యూళ్లను తయారు చేయాలని తెలిపారు. వరికెపూడిశెల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరత్నం, పోలవరం–బనకచర్ల ప్రాజెక్ట్ ఈఈ శివరాంప్రసాద్, డీఈలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఏఈలు వెంకటేశ్వర్లు, శంకరాచారి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

నరసరావుపేట: పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 12గంటలకు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఓటీపీ విధానంతో ఆస్తులకు రక్షణ



మంగళగిరి: ఓటీపీ విధానంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉంటుందని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్‌కు అడ్డుకట్టపడటంతో పాటు ప్రజల ఆస్తులకు భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన మార్పులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, విజయవాడ డీఐటీ రవీంద్ర, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య పాల్గొన్నారు.

పిచ్చివాడి ప్రేలాపనలు





చిత్ర పరిశ్రమ పెద్దగా, మెగాస్టార్‌గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న చిరంజీవిపై అసెంబ్లీలో బాలయ్య వాచాలత్వం, అహంకారపూరిత వ్యాఖ్యలు ఆయన మానసిక ధోరణికి అద్దం పడుతున్నాయి. బాలయ్య విపరీత వ్యాఖ్యలపై చిరంజీవి అభిమానులు, కాపు నేతలు భగ్గుమంటున్నారు. సభ్యత లేకుండా మెగా ఫ్యామిలీపై అసూయతోనే వ్యాఖ్యలు చేశారని మండిపడుతున్నారు. టీడీపీ అధికారంలోకి రావడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్, చిరంజీవి అభిమాన సంఘాల కృషి ఉందన్నది అక్షర సత్యం. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఇప్పుడు టీడీపీ అధిష్టానం వ్యవహరిస్తోంది. డెప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్‌ను ఆ పార్టీ నేతలు సహించలేకపోతున్నారు. పొగబెట్టి సాగనంపడానికి పావులు కదుపుతున్నారు. అసెంబ్లీలో బాలయ్య అసందర్భ వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయని పవన్ అభిమానులు, కాపు నేతలు మండిపడుతున్నారు. నాడు సంక్షోభంలో ఉన్న చిత్ర పరిశ్రమను ఆదుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేశారు. చిరంజీవి తరతర సినిమా పెద్దల విజ్ఞప్తి మేరకు పెద్ద మనస్సుతో టికెట్ల రేట్లు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చారు. దాన్ని ఇప్పుడు రచ్చచేయడం వెనుక పెద్ద వ్యూహం ఉందని చిరంజీవి అభిమానులు, కాపు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలయ్య నోటి దురుసు తగ్గించుకోవాలని హితవు పలికారు. సొంత అన్నను తూలనాడిన పవన్ కల్యాణ్ కూడా వెంటనే స్పందించి బాలయ్యకు దీటుగా సమాధానం ఇవ్వాలని చిరంజీవి అభిమానులు, కాపు నేతలు కోరుతున్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు అనుచితం

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె(చెరుకుపల్లి): మెగా స్టార్ చిరంజీవి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిపై అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే దిధంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఖండించారు. గుళ్లపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు, శాసన సభ సమావేశాల్లో ఎమ్మెల్యే హోదాలో ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన బాలకృష్ణ మతిస్థిమితం లేని వ్యక్తిగా మాట్లాడారని తెలిపారు. ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించిన వ్యక్తిని ఏక వచనంతో తూలనాడటం సంస్కారం కాదని హితవు పలికారు. హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ అనర్హుడని విమర్శించారు. గతంలో సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై తుపాకితో కాల్పులు జరిపి, వైద్యుల దగ్గర మానసిక పరిస్థితి బాగోలేదని సర్టిఫికెట్ తెచుకున్నది నిజం కాదా ? అని గణేష్ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏడుకొండలురెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, ముస్లిం విభాగం మండల అధ్యక్షుడు ఆజాముద్దీన్, నగరం మండల యువజన విభాగం నాయకుడు ఎస్. శ్రీనివాసరెడ్డి, అక్కల గోపిరెడ్డి, నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

అసెంబ్లీలోనే క్షమాపణ చెప్పాలి



అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన తీరు ఆయన మానసికస్థితికి అద్దం పడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యార్లగడ్డ మదన్‌మోహన్ అన్నారు. రేపల్లెలో శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతోందని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు.

తప్పుని ప్రశ్నిస్తే అరెస్టులా?

పర్చూరు సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: తప్పుని తప్పని ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తారా.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం ? అని పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావుపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేసిన నేపథ్యంలో గాదె విలేకరులతో మాట్లాడారు. దేవాలయంలాంటి అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. సౌమ్యుడు, పెద్ద మనిషి చిరంజీవి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని తూలనాడటం దారుణమని ఖండించారు. వాడు వీడంటూ చిరంజీవిని అనడమే కాకుండా సైకోగాడు అని వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని బాలకృష్ణ సంబోధించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇంతకంటే సిగ్గు చేటు లేదన్నారు. బాలకృష్ణ ప్రతిపక్ష నేతను పట్టుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే వైఎస్సార్ సీపీ శ్రేణులు ఊరుకోవని ఆయన హెచ్చరించారు. బాలకృష్ణ మాట్లాడినవి తప్పుడు మాటలని ద్రోణాదుల సర్పంచ్ భాగ్యారావు ప్రశ్నిస్తే ఆయనపై కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పును తప్పుగా ప్రశ్నించే హక్కు లేదా? అని గాదె ప్రశ్నించారు. తప్పుడు కేసులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టలేరని, పార్టీ అండగా ఉందని తెలిపారు. కార్యకర్తలు భయపడాల్సిన పని లేదని, కేసులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు.

బాలకృష్ణ దిష్టిబొమ్మ దహనం



చినగంజాం: అసెంబ్లీలో సినీ హీరో చిరంజీవిపై హిందూపురం శాసన సభ్యుడు బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. హీరో చిరంజీవితో పాటు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని సైకో అంటూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. బాలకృష్ణను అసెంబ్లీలో ఒక రోజు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యకర్తలు బాలకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఎత్తిపోతలకు భారీ జలకళ



విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతానికి భారీగా వర్షం నీరు వచ్చి చేరటంతో జలకళతో కళకళలాడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మాచర్ల పట్టణంలోని చంద్రవంకవాగు, భైరవునిపాడు, తాళ్లపల్లి చెరువులు, ఎత్తిపోతల చుట్టూ ఉన్న అన్నీ చెరువులకు నీరు అధికంగా రావడంతో ఆ నీరంతా తరలివస్తోంది. ఎత్తిపోతల జలపాతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న సుందరమైన నీటి దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా పర్యాటకులు ఎత్తిపోతల అందాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు.

'మన జిల్లా.. మన బాపట్ల' అభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ వి.వినోద్ కుమార్

బాపట్ల: మన జిల్లా.. మన బాపట్ల అభివృద్ధి అనే సంకల్పంతో అధికారులంతా పని చేయాలని కలెక్టర్ వి. వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్‌తో కలిసి కమాండింగ్ కంట్రోల్ రూం సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటిని దుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సమర్థంగా పని చేయాలని తెలిపారు. డీఆర్వో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కమాండింగ్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో ప్రతి శాఖ నుంచి ఒక అధికారి విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కమాండింగ్ రూం 24/7 పని చేస్తుందని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ టీంకు నోడల్ అధికారిగా నాగిరెడ్డి, మండలాలకు సంబంధించి నోడల్ అధికారులు ఉంటారని వెల్లడించారు. స్వర్ణాంధ్రా విజన్ టీంకు నోడల్ అధికారిగా సీపీఓ ఎ.ఎస్.రాజు, సూపర్ సేవింగ్స్ టీంకు నోడల్ అధికారిగా యశ్వంత్ ఉంటారని కలెక్టర్ వివరించారు.

మొదటి మూడు స్థానాల్లో ఉండేలా..

అన్ని విభాగాల్లో జిల్లా అభివృద్ధి మొదటి మూడు స్థానాల్లో ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పని చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం డీఆర్ఓ, ఇంచార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్‌తో కలసి గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళిక తయారీపై గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, జిల్లా అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కువగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను సబ్బుతో తరచూ కడుక్కోవాలని ఆయన సూచించారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్టీలు, దివ్యాంగుల సమస్యలపై ..

బాపట్ల: ఎస్టీలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్టీలు, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌ను నాలుగో శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగుల వద్దకు కలెక్టర్ ప్రత్యేకంగా వెళ్లి, వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. తక్షణమే న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

హాస్టల్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచాలి

సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జర్మన్ లాంగ్వేజ్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపేలా శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. తల్లికి వందనం లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అన్నపూర్ణా దేవిగా బగళాముఖి అమ్మవారు

చందోలు(కర్లపాలెం): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం చందోలు బగళాముఖి అమ్మవారు అన్నపూర్ణా దేవిగా పూజలందుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నపూర్ణా దేవి అలంకరణలో ఉన్న బగళాముఖిని దర్శించుకుని పూజలు చేశారు.



క్లుప్తంగా

ఆలయంలో చోరీకి విఫలయత్నం

సంతమగులూరు(అద్దంకి): ఆలయంలో చోరీ చేయడానికి ఓ యువకుడు విఫల యత్నం చేసిన ఘటన మండలంలోని ఏల్చూరు గ్రామ దేవస్థానంలో గురువారం రాత్రి జరగ్గా.. శుక్రవారం వెలుగు చూసింది. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో గంటలు చోరీ చేసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. గమనించి యువకులు అతన్ని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు విచారించగా మద్యం తాగేందుకు డబ్బు కోసం దొంగతనం చేయడానికి వచ్చినట్లు చెప్పాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అద్దంకి: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు వేలమూరిపాడు గ్రామానికి చెందిన సింగయ్య(45) వ్యవసాయం చేస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవింగ్ తెలిసి ఉండడంతో ట్రాక్టర్ కొనుగోలు చేసి బాడుగల ద్వారా కుటుంబాన్ని పోషించాలని అనుకున్నాడు. ప్రకాశం జిల్లా దర్శిలోని ఓ ఫైనాన్స్ కంపెనీ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో నాలుగు నెలల నుంచి కిస్తీలు కట్టకపోవడంతో ఫైనాన్స్‌కు చెందిన వారు గురువారం ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. దాంతో మనస్తాపానికి గురైన సింగయ్య (45) ఇంట్లో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతునికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మార్టూరు: జాతీయ రహదారిపై రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక హీరో షోరూం ఎదుట రోడ్డు మార్జిన్లో నిలిపి ఉంది. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న గూడ్స్ క్యారియర్ ఆటో వెనుక నుంచి బలంగా బస్సును ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆటోలో ఉన్న ఒంగోలు సమీపంలోని త్రోవగుంటకు చెందిన రాయపాటి ప్రకాష్ (35) ఘటనా స్థలంలో మృతి చెందాడు. ప్రమాదానికి ఆటో డ్రైవర్ నిద్రమత్తు కారణమని భావిస్తున్నారు. ప్రకాష్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు విద్యార్థుల ఉసురు తీసిన కాలేజీ బస్సు

- మృతులు వరుసకు అన్నదమ్ములు
- దసరాకు స్వగ్రామం వస్తుండగా ప్రమాదం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు

పొదిలి: దసరా పండగను స్వగ్రామంలో జరుపుకొనేందుకు బయల్దేరిన ఇద్దరు బీటెక్ విద్యార్థులను ఓ కాలేజీ బస్సు పొట్టన పెట్టుకుంది. వరుసకు అన్నదమ్ములైన వీరు బైకుపై విజయవాడ నుంచి స్వగ్రామం హనుమంతునిపాడుకు బయల్దేరారు. ఈ క్రమంలో శుక్రవారం పోతవరం వద్ద ఓ కాలేజీ బస్సు ఢీకొనటంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలు.. మచ్చా బ్రహ్మయ్య (19), బండ్లమూడి గురువిష్ణు (22) అక్కాచెల్లెళ్ల కుమారులు. విజయవాడలో బీటెక్ చదువుతున్నారు. గురువిష్ణు కుటుంబం విజయవాడలో, బ్రహ్మయ్య కుటుంబం హనుమంతునిపాడులో ఉంటోంది. దసరా పండగకు హనుమంతునిపాడులో గడిపేందుకు బైకుపై శుక్రవారం ఉదయం బయల్దేరారు. వేగంగా వస్తున్న కాలేజీ బస్సు యువకులను ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడే కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మోటారు సైకిల్ దూరంగా పడి ఉంది. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న కాలేజీ బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు.

భీతావహంగా సంఘటన స్థలం

ప్రమాద స్థలం భీతావహంగా మారింది. ఒక యువకుడి మెదడు చిదిరి రోడ్డంతా పడింది. వర్షం కురుస్తుండటంతో రక్తంతో రోడ్డంతా ఎరుపెక్కింది.



సంఘటన స్థలంలో మృతదేహాలు

మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. శరీర భాగాలు దూరంగా ఎగిరిపడ్డాయి. బ్యాగ్‌లు, పిండి ప్యాకెట్ సంఘటన స్థలంలో పడి ఉన్నాయి. తొలుత గుర్తు తెలియని వాహనంగా అనుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఓ ప్రైవేటు కాలేజీ బస్సు సంఘటనకు కారణంగా అనుమానించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేయడంతో బస్సు వివరాలు తేలాయి. కంభాలపాడు వైపు నుంచి పిల్లలను ఎక్కించుకుని విశ్వనాథపురానికి వస్తున్న



ప్రమాదానికి కారణమైన కాలేజీ బస్సు



వైద్యశాలలో విలపిస్తున్న బంధువులు

బస్సు మధ్యలో పోతవరం విద్యార్థులు చేయెత్తినా ఆపకుండా వెళ్లింది. ఈ క్రమంలో విద్యార్థులను విచారించగా... ఆ బస్సే ప్రమాదానికి కారణమని తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పండగకు వస్తూ పరలోకాలకు..

మృతుల తల్లులు తిరుపతమ్మ, రమణమ్మలు అక్కాచెల్లెళ్లు. వీరిది వెలిగండ్ల మండలం పూలికుంట్ల. బ్రహ్మయ్య తల్లిదండ్రులు హనుమంతునిపాడులో నివాసం ఉంటున్నారు. ఇంటర్ వరకు కనిగిరిలో చదివిన బ్రహ్మయ్య.. బీటెక్ చదివేందుకు విజయవాడలో చేరి హాస్టల్లో ఉంటున్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న బండ్లమూడి రాజా, రమణమ్మల కుమారుడైన విష్ణు విజయవాడలోనే బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. సెలవులు ఇవ్వడంతో విష్ణు, బ్రహ్మయ్యలు పండగ ఆనందంగా గడిపేందుకు వస్తుండగా బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ప్రభుత్వ వైద్యశాలకు చేరిన కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

డిజిటల్ అరెస్ట్‌ను ఛేదించిన పోలీసులు

- కర్ణాటకు చెందిన ఇద్దరి అరెస్ట్
- రూ.2.50 లక్షలు స్వాధీనం, ఖాతాల్లోని రూ.55 లక్షల నగదు ఫ్రీజ్
- బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ వెల్లడి

బాపట్ల టౌన్: డిజిటల్ అరెస్ట్ అంటూ రిటైర్డ్ ప్రభుత్వ వైద్యుడిని బెదిరించి రూ.1.10 కోట్లు కొల్లగొట్టిన కేసును బాపట్ల పోలీసులు ఛేదించారు. కర్ణాటకకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55 లక్షలను ఫ్రీజ్ చేయించారు. ఈ కేసు వివరాలను బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ శుక్రవారం వివరించారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. చీరాల పట్టణానికి చెందిన విశ్రాంత వైద్యుడికి ఈ నెల 9న తొలుత ట్రాయ్ (టెలికమ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి మాట్లాడుతున్నామని అంటూ కాల్ వచ్చింది. అదే రోజు మధ్యాహ్నం ఇన్‌కంట్యాక్స్ విభాగం నుంచి మాట్లాడుతున్నామని అంటూ మరో కాల్ వచ్చింది. ఈ నెల 10న మీపై ట్రాయ్, ఇన్‌కంట్యాక్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా దర్యాప్తు చేస్తున్నాం.. సీబీఐ అధికారులమంటూ యూనిఫాంలో ఉన్న నకిలీ పోలీసులు వీడియో కాల్ చేశారు. ఈ కేసులో భాగంగా మీ ఇంట్లో సోదాలు నిర్వహించాలంటూ బెదిరించారు. అలా జరగకుండా ఉండాలంటే ముందు రూ.1.10 కోట్లు చెల్లించాలని, దర్యాప్తులో నిర్దోషి అయితే డబ్బు బ్యాంకు ఖాతాకు వాపసు చేస్తామని చెప్పారు. ఇది నిజమని నమ్మిన ఆయన ఈనెల 11న వారు పంపించిన ఎస్ బ్యాంక్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

అకౌంట్‌కు రూ.50 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్‌కు రూ.50 లక్షలు జమ చేశారు. ఈ నెల 17న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్‌కు మరో రూ.10 లక్షలు జమ చేశారు. తరువాత వారి నుంచి ఫోన్ రాకపోవడంతో అనుమానించిన ఆయన ఈ నెల 19న చీరాల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇది కర్ణాటకకు చెందిన వ్యక్తుల మోసమని గుర్తించారు. చీరాల వన్‌టౌన్ సీఐ, జిల్లా ఐటీ కోర్ సిబ్బంది కొందరు కర్ణాటక వెళ్లి ఇద్దరిని అరెస్టు చేసి తీసుకొచ్చి శుక్రవారం బాపట్ల కోర్టులో హాజరుపరిచారు. విచారణలో తమతోపాటు తమిళనాడు, ఇతర దేశాలకు చెందినవారు ఈ ముఠాలో ఉన్నట్లు నిందితులు తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లోని ఖాతాల్లో ఉన్న రూ.55 లక్షల్ని ఫ్రీజ్ చేయించారు. కేసును త్వరితగతిన ఛేదించిన చీరాల వన్‌టౌన్ సీఐ, చీరాల డీఎస్పీ, జిల్లా ఐటీ కోర్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి

పట్నంబజారు: అసెంబ్లీ సాక్షిగా నటుడు చిరంజీవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిలపై ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీస విజ్ఞత లేకుండా సభా మర్యాద తెలియని బాలకృష్ణ తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న మద్యాన్ని తాగి వ్యాఖ్యలు చేసినట్లు అనిపిస్తోందని విమర్శించారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్ ద్వారా ఎంతో లబ్ధి పొందిన విషయాన్ని గుర్తించాలన్నారు. బసవతారకం హాస్పిటల్‌కు సంబంధించి పెండింగ్ బిల్లులను టీడీపీ హయాంలో ఇవ్వకపోతే, స్వయంగా వై.ఎస్.జగన్ వాటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగితే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెంటనే రాజకీయం చేయకుండా బాలకృష్ణ జీవితాన్ని కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. తండ్రిపై చెప్పులు వేయించిన వ్యక్తితో పయనిస్తున్న బాలకృష్ణకు, తండ్రి ఆశయాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వై.ఎస్.జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ సినిమా వాళ్లను అవమానించారంటూ పిచ్చి బట్టిన వ్యాఖ్యలు చేస్తూ వై.ఎస్.జగన్‌పై కూటమి నేతలు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజా సమస్యలు చర్చించిన పాపాన పోలేదని మండిపడ్డారు. సినిమా డైలాగులు చెప్పడం తప్ప, కనీసం మాట్లాడలేని బాలకృష్ణ ఒక సైకో అని మండి పడ్డారు సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు వేలూరి అనిల్‌రెడ్డి, కానూరి శశిధర్, వెంకటేష్‌రెడ్డి, దానం వినోద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆళ్ల ఉత్తేజ్ రెడ్డి

వ్యక్తి మృతిపై విచారణ

అచ్చంపేట: స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 21న సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతో వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం అడిషనల్ డీఎంహెచ్ ఒ పద్మావతి విచారణ చేపట్టారు. మృతుడు షేక్ నాగుల్‌మీరా బంధువులను పిలిపించి విచారించారు. నాగుల్‌మీరా సకాలంలో వైద్యం అందకపోవడం వల్ల మృతి చెందాడా, మరే కారణాల వల్ల మృతి చెందాడా అనే విషయాలపై ఆరా తీశారు. తుది నివేదికను తన ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

లలితాత్రిపుర సుందరిగా జిల్లెళ్ళమూడి అమ్మవారు



దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామంలో కొలువైన అనసూయ దేవి అమ్మవారు శుక్రవారం భక్తులకు లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు.

– బాపట్ల టౌన్

16 మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 16 మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. అత్యధికంగా పెదకాకాని మండలంలో 15.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ పడింది. సగటున 5.5 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 12.2, గుంటూరు తూర్పు 9.2, ఫిరంగి పురం 8.4, కొల్లిపర 8.2, దుగ్గిరాల 6.8, తుళ్ళూరు 6.8, చేబ్రోలు 6.2, తెనాలి 6.2, తాడికొండ 4.2, పెదనందిపాడు 3.8, మేడికొండూరు 3.4, తాడేపల్లి 3.4, కాకుమాను 2, మంగళగిరి మండలంలో 1.8 మి.మీ. చొప్పున పడింది. సెప్టెంబర్ 26వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 138.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 258.5 మి.మీ.గా నమోదైంది.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో అక్టోబర్ 26న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 99499 29674, 79890 88274 ఫోను నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు తప్పిన ప్రమాదం

- నేషనల్ హైవేపై ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఆటోలో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలు

ప్రత్తిపాడు: హైవేపై పెను ప్రమాదం తప్పింది. మార్జిన్‌లో నిలిపి ఉంచిన ఫర్నీచర్ లోడ్ ఆటోను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 40 మంది డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రమాదం తప్పిపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అచంట మండలం కొండమంచిలి గ్రామానికి చెందిన మానూరి త్రినాథ్ గత కొంతకాలంగా విజయవాడలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీ రాత్రి త్రినాథ్ తన మేనల్లుడు పొదిలి మోషేకుతో కలసి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి ట్రాలీ ఆటోలో కుర్చీల లోడుతో తిరుపతికి బయల్దేరాడు. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో ఆటో నడుపుతున్న మహేష్ కాలకృత్యాల కోసం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సమీపంలో పదహారో నంబరు జాతీయ రహదారిపై మార్జిన్‌లో ఆటో నిలిపాడు. తర్వాత కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన సుమారు 40 మంది ఉపాధ్యాయులతో గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న కనిగిరి డిపో ఆర్టీసీ బస్సు వేగంగా ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ఉన్న త్రినాథ్‌తోపాటు ఆటో కూడా సైడు కాలువలోనికి దూసుకుపోయింది. ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, త్రినాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న 40 మంది డీఎస్సీ ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం జరగలేదు. వీరంతా గురువారం రాజధానిలో జరిగిన సీఎం సభకు హాజరై రాత్రికి తిరుగు పయనమయ్యారు. త్రినాథ్‌ను చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.నరహరి తెలిపారు.



ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సైడు కాలువలోకి పడిపోయిన ఫర్నీచర్ లోడ్ ఆటో

నియంత్రణలోనే డయేరియా

– గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో అతిసార వ్యాధి నియంత్రణలో ఉందని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 177 కేసులు నమోదు అయ్యాయన్నారు. గుంటూరు నగరం నుంచి 152 కేసులు రాగా, గ్రామీణ ప్రాంతం నుంచి 25 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి, నిశితంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 91 మంది చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. నియంత్రణ చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టామని వివరించారు. 120 ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లను గుంటూరులో తనిఖీ చేయగా, 21 చోట్ల హానికారక బ్యాక్టీరియాను గుర్తించామన్నారు. వాటిని తక్షణం సీజ్ చేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో 140 ప్రైవేట్ ప్లాంట్లను తనిఖీ చేయగా.. 16 చోట్ల నీరు కలుషితం జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. దాదాపు 8 వేల గృహాలలో సర్వే చేశామన్నారు. సాధారణ నీటి సరఫరాను నిలిపి, అవసరమైన చోట ప్రత్యేకంగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

97 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

తాడికొండ: అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం(ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామాల రైతులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 97 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 41 నివాస ప్లాట్లు కాగా, 36 వాణిజ్య ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. మొత్తంగా 56 మంది రైతులు, భూయజమానులకు ప్లాట్లను కేటాయించారు. అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్(ల్యాండ్స్)/స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్- క్యాపిటల్ సిటీ) ఎస్‌వీఎస్‌బీ వసంతరాయుడు మాట్లాడుతూ రైతులకు భౌగోళికంగా ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జి.ఐ.ఎస్. సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. రుసుము వసూలు చేయబడదని రైతులు గమనించాలని కోరారు.



రిటర్నబుల్ ప్లాటు పత్రాలు అందిస్తున్న దృశ్యం

చెస్‌తో నిర్ణయ సామర్థ్యాలు పెరుగుతాయి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

చేబ్రోలు: చెస్ ఆట వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల కార్యక్రమంలో శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్న పెమ్మసాని ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహాభారతం కాలం నుంచి భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, వారసత్వం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు. అక్టోబర్ 2 వరకూ ఈ పోటీలు జరుగుతాయి.



ఎంఆర్ లలిత్‌బాబుతో గేమ్ ఆడుతున్న పెమ్మసాని


5 రౌండ్లు ముగిసే సమయానికి పోటీల తీరిది..

- నాలుగుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన జీఎం కృష్ణన్ సశికిరణ్, రైల్వేల అత్యధిక రేటింగ్ కలిగిన ఐఎం అరోన్యక్ ఘోష్తో కలిసి ఐదు రౌండ్లలో ఐదు పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకువెళ్లారు.
- తరువాతి స్థానంలో తొమ్మిదిమంది ఆటగాళ్లు 4.5 పాయింట్లతో పోటీలో కొనసాగుతున్నారు.
- ఐదుసార్లు జాతీయ విజేత జీఎం అభిజీత్ గుప్తా, తమిళనాడు చాంపియన్ బి.విజయేష్‌పై ఏడో వరుసలో శక్తివంతమైన పాన్ ఆధిక్యంతో సులభ విజయం సాధించాడు.
- ఆంధ్ర ఆటగాడు, రైల్వేల ఐఎం ఎస్.రవితేజ, ప్రపంచ అమెచ్యూర్ రజత పతక విజేత ఏ.కుమారేష్ (తమిళనాడు)పై విజయం సాధించాడు.

ఎన్‌ఆర్‌ఐ కోటా పీజీ కోర్సులకు దరఖాస్తు తేదీ పొడిగింపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2025–26కి గాను ఎన్‌ఆర్‌ఐ కోటా, ఇన్‌లై ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో ఎమ్మెస్సీ, ఎంబీఏ (ఏబీ), ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 24వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు 'రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలన విభాగం, లాం గుంటూరు 522005' చిరునామాకు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన నల్లూరి శ్రీనివాసరావు (50) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తుమ్మలపాలెం నుండి చిలకలూరిపేట వైపు పదహారవ నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఆటోలో వేగంగా వెళుతున్నాడు. వాహనం అదుపుతప్పి సర్వీసు రోడ్డులో ఉన్న ప్రహరీని బలంగా ఢీకొట్టింది. శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎన్.నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహం.. 14 మందిపై కేసు నమోదు

సత్తెనపల్లి: బాల్యవివాహంలో 14 మందిపై సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 3న పట్టణంలోని దోభీఘాట్‌లో బలుసుపాటి గోపి తన సొంత సోదరి కుమార్తె అయిన ఆరేటి అనుఖ్యలకు బాల్య వివాహం జరిగిందని నరసరావుపేట చైల్డ్ వెల్ఫేర్ కేర్ సంస్థకు ఫిర్యాదు వచ్చినట్లు ఈ నెల 23న చైల్డ్ వెల్ఫేర్ కేర్ సంస్థ ప్రతినిధి యర్రసాని ప్రశాంత్‌కుమార్ పట్టణంలోని 4వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ గరికె కల్పనకు తెలియజేశారు. దీనిపై గరికె కల్పన విచారణ జరిపి వాస్తవం అని తేలడంతో ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహం చేసుకున్న ఇరువురితోపాటు ఇరువురు తల్లిదండ్రులు, బంధువులు, వివాహం జరిపిన పూజారి, కల్యాణ మండపం నిర్వాహకుడు, ఫొటోగ్రాఫర్ ఇలా మొత్తం 14 మందిపై బాల్య వివాహ చట్టం క్రింద పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. శుక్రవారం మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అజయ్ ఇంటెలికాప్ మహారాష్ట్ర ఎన్జీవో బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగవుతున్న క్షేత్రాలకు డీపీఎం అమల కుమారి వారిని తీసుకువెళ్లి వివరించారు. రైతులు పండిస్తున్న పలు పంటల సాగు వివరాలు, కషాయాల వినియోగం, బీజామృతం వంటి ప్రకృతి పద్ధతులను వివరించారు. బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్లో ఘన, ద్రవ జీవామృతాల తయారీని పరిశీలించారు.